ప్రజాశక్తి
సోమవారం 2 సెప్టెంబర్ 2024
5
అనంతపురం

భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని జిల్లా డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. ఆదివారం అనంతపురం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి భారీ వర్షాల నేపథ్యంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, అన్ని శాఖల మండల, క్షేత్రస్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టీసీలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెలీ కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాల వల్ల ఆయా శాఖల పరిధిలో జరిగిన నష్టాలకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు అందజేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. వర్షాలు కురుస్తున్న వేళ మున్సిపాలిటీలలో వర్కర్లు పనిచేయాలని, కార్పొరేషన్లు, పంచాయతీలలో డ్రయినేజీలు శుభ్రంగా ఉంచాలని, ఎలాంటి ఇబ్బంది లేకుండా నీరు ముందుకు వెళ్లేలా చూడాలని అన్నారు. ఎక్కడైనా పరిశుభ్రత లేకపోతే సంబంధిత వార్డు సెక్రటరీపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేషన్, మున్సిపాలిటీలకు కొత్తగా నియమించిన కమిషనర్లు వెంటనే విధుల్లోకి రావాలన్నారు. జిల్లా కంట్రోల్ రూమ్, డివిజన్లలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌లకు సంబంధించిన వాట్సాప్ నంబర్లపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, క్షేత్రస్థాయిలో వర్షాల కారణంగా ప్రజలకు ఏదైనా ఇబ్బంది ఏర్పడినా వాయిస్, వీడియో, ఇమేజ్, టెక్స్ మెసేజీల రూపంలో గానీ ఫోన్ నెంబర్లకు తెలియజేయాలన్నారు. ఆయా డివిజన్ల నుంచి రిపోర్టులను ఫార్మాట్ రూపంలో జిల్లా అధికారులు అందించాలన్నారు. ఎక్కడైనా ఆక్రమణలు ఉంటే వాటికి సంబంధించి నోటీసులు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ సెక్రటరీలను ఆదేశించారు. ఎక్కడ నీరు నిలబడకుండా అవుట్ లెట్ తయారుచేసి డ్రయినేజీలకు కలపాలని, అవసరమైతే మోటార్లు పెట్టి నీటిని తొలగించాలని చెప్పారు. నదులు, వాగులు, వంకల్లో ఎన్ఆర్ఈజీఎస్ కింద ఎక్కువగా వాటర్ కన్జర్వేషన్ స్ట్రక్చర్స్, వాటర్ షెడ్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, లాంగ్ టర్మ్ యాక్షన్ ప్రణాళిక చేపట్టేందుకు ఇది మంచి అవకాశం అని వివరించారు. జిల్లాలోని పెన్నా, హగరీ, వేదవతి, తదితర నదులకు సంబంధించి రివర్ కన్జర్వేషన్ రిపోర్ట్ ఎప్పటికప్పుడు అందించాలన్నారు. మండల, పంచాయతీల వారీగా శానిటేషన్ వర్కర్లు, పరికరాల వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలని, శానిటేషన్ యాక్టివిటీలు వెంటనే మొదలు పెట్టాలని డీపీవో, ఎంపీడీవోలకు సూచించారు. ఎక్కడైనా పనులు అనుకున్నట్టు జరగకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. వాటర్ ప్యూరిఫికేషన్, వాటర్ సేఫ్టీ చేపట్టాలని, తాగునీరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఆర్డీవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. ఆర్ అండ్ బి, వ్యవసాయం, పంచాయతీ, పశుసంవర్ధక శాఖ, ఇతర శాఖల పరిధిలో అధికారులు సన్నద్ధంగా ఉండి అన్ని రకాల జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఆసుపత్రులకు మెడికల్ సిబ్బంది అందరూ హాజరయ్యేలా చూడాలని డిఎంహెచ్ఒ, డిసిహెచ్ఎస్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్లను ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండ్లలో నీరు నిలబడకుండా చూడాలని, నీరు నిలబడకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఆర్టీసీ ఆర్ఎం, డిపో మేనేజర్లను ఆదేశించారు.

నేడు పాఠశాలలు, కళాశాలలకు సెలవు

ప్రస్తుతం ఉన్న భారీ వర్షాలు, వరద పరిస్థితి దృష్ట్యా జిల్లాలోని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఈ విషయాన్ని అన్ని, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు గమనించాలని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సెలవు ప్రకటించాలని ఆదేశించారు.

విధులకు హాజరుకాని వైద్యసిబ్బందిపై చర్యలు

పెద్దవడుగూరు : ఆదివారం విధులకు హాజరుకాకుండా ఉన్న వైద్య సిబ్బందిపై చర్యలు తప్పవని కలెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. తుఫాను కంట్రోలు రూం ఏర్పాటు విషయంలో పెద్దవడుగూరుకు ఆదివారం వచ్చిన ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఫార్మాసిస్టు, ల్యాబెక్నిషియన్ విధులకు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రోగులపట్ల శ్రద్ధ చూపనివారిపై చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఆసుపత్రి భవనం పూర్తిగా శిథిలావస్థలో ఉన్నందున నూతనంగా నిర్మించిన భవనంలోకి వెళ్లాలని వైద్యసిబ్బందికి సూచించగా ఇంకా తమకు అప్పగించలేదని వైద్యులు శ్రీనివాసబాబు కలెక్టర్‌కు వివరించారు. వెంటనే సంబంధిత ఉన్నతాధికారులతో కలెక్టర్ చరవాణిలో చర్చించి త్వరితగతిన నూతన ఆసుపత్రి భవనంలోకి మార్పు చేసేలా చూడాలని చెప్పారు. అనంతరం ఆయన నూతన ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఎస్సీకాలనీలో పర్యటించిన కలెక్టర్ దృష్టికి స్థానికులు డ్రయినేజీ సమస్యను తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటరమణనాయక్, ఉప తహశీల్దారు వెంకటేశ్వరమ్మ, డాక్టరు శ్రీనివాసబాబు, సిహెచ్‌వి చిట్టితల్లి, ఎంపీడీవో కుళ్లాయిస్వామి, ఈవోఆర్డీ నాగేశ్వరశాస్త్రి, మండల విద్యాధికారి రాముడు, ఎస్ఐ చిన్న రెడ్డెప్ప, ఎపిఒ పుల్లారెడ్డి, పంచాయతీరాజ్ ఇంజనీర్లు సురేష్‌రెడ్డి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలల సౌధం సాకారమయ్యేనా..?

కదలిక లేని స్మార్ట్ టౌన్‌షిప్
ఆందోళనలో దరఖాస్తుదారులు
డబ్బు వెనక్కివ్వాలని వేడుకోలు

ప్రజాశక్తి-పెనుకొండ

'మధ్యతరగతి కుటుంబాల కోసం లాభాపేక్ష లేకుండా అందుబాటు ధరల్లో లేఅవుట్లు తీసుకోస్తున్నాం. మొదటి దశలో ఆరు చోట్ల అభివృద్ధి చేస్తున్నాం..ప్రతి నియోజవకర్గలోనూ ఏర్పాటు చేసి మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయబోతున్నాం. లేఅవుట్‌లో 50శాతం స్థలాన్ని సార్కులు, స్కూళ్లు, క్రీడా మైదానాలు, బ్యాంకులు, షాపింగ్, రిక్రియేషన్ సదుపాయాల కోసం కేటాయిస్తాం. విశాలమైన 60 అడుగుల బీటీరోడ్లు, 40 అడుగుల సిమెంట్ రోడ్లు, కలర్ టైల్స్‌తో పుట్‌పాత్‌లు, రోడ్ల కిరువైపులా మొక్కలు, వీధిదీపాలు, తాగునీటి సరఫరా, యూజీడీ, వరద నీటి కాలువలు ఉంటాయి'. 2022 జనవరి 11న జగనన్న స్మార్ట్ టౌన్‌షిఫ్ వెబ్‌సైట్ ప్రారంభించిన సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పిన మాటలివి.

మధ్యతరగతి కుటుంబాలకు అరచేతిలో సొంతింటిని చూపించిన అప్పటి ప్రభుత్వం వారి కలలను కల్లలు చేసింది. అదిగో..ఇదిగో అంటూ హడావుడి చేసి ఉసూరుమనిపించింది. జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌ల్లోని ప్లాట్ ధరలో పదిశాతాన్ని దరఖాస్తుదారుల నుంచి వసూలు చేసిన అప్పటి జగనన్న సర్కారు వారికి స్థలాలను అప్పగిందించనేలేదు. లేఅవుట్లలో విశాలమైన తారు, సిమెంట్ రోడ్లు కాదుకదా.. కనీస సదుపాయలూ కనబడటంలేదు. కొన్ని చోట్ల లేఅవుట్లు వేసి ప్లాట్లు కేటాయిస్తే, మరికొన్ని పట్టణాల్లో స్థలం సేకరించి కరపత్రాల్లో మాత్రమే పాట్లు కనపడుతున్నాయి.

జిల్లాలో ఆరు టౌన్‌షిప్‌లు...

శ్రీసత్యసాయి జిల్లాలో ఆరు టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు అప్పటి ప్రభుత్వం కార్యచరణ చేపట్టింది. ఈ ఆరు టౌన్‌షిప్‌ల పరిధిలో 2,781 దరఖాస్తులు వచ్చాయి. అందులో దాదాపుగా 1700 నుంచి1800 ప్లాట్లు ప్రభుత్వం కేటాయించింది. ధర్మవరం, కోడూరు, పెనుకొండ, మడకశిర, పుట్టపర్తి, కదిరిల్లో టౌన్‌షిప్‌లున్నాయి. ఇందులో ధర్మవరంలో 1147 పాట్లు, కోడూరులో 133పాట్లు, పెనుకొండలో 290పాట్లు, మడకశిరలో 123పాట్లతో స్మార్ట్ టౌన్‌షిప్ లేఅవుట్లు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పుట్టపర్తిలో ప్లాట్ల కేటాయింపులులేవు, కదిరిలో భూసేకరణ కాలేదు.

ఆందోళనలో దరఖాస్తుదారులు

అప్పటి ప్రభుత్వం అనుకున్న సమయానికి దరఖాస్తుదారులకు ప్లాట్లు అభివృద్ధి చేసి ఇవ్వలేకపోయింది. కూటమిప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఎంఐజీ లేఅవుట్ల విషయంలో ఇప్పటి వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో డబ్బు చెల్లించిన దరఖాస్తు దారులు ఆందోళనకు గురవుతున్నారు. కొందరు వారు చెల్లించిన 10శాతం డబ్బును తిరిగి తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం దరఖాస్తు దారులకు ప్లాట్లు ఇస్తోందో ఇవ్వదో అనే అనుమానంతో కొందరు అసలు ఈ పథకమే రద్దు చేస్తుందని మరికొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వెంటాడుతున్న వైఎస్ 'స్వగృహ' భయం...

వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో రాజీవ్ స్వగృహ ప్రాజెక్టు కోసం డబ్బులు చెల్లించిన మధ్యతరగతి వారెందరో ఇబ్బందులు పడ్డారు. ప్రాజెక్టు పూర్తికాక ఇటు డబ్బులూ వెనక్కి రాక అష్ట కష్టాలు పడ్డారు. జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌లోనూ ఇలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయని పెనుకొండ లేఅవుట్‌లో డబ్బు కట్టిన ఒకరు అభిప్రాయపడ్డారు. సంవత్సరాలు గడుస్తున్నా సదుపాయాలు కల్పించి రిజిస్ట్రేషన్ చేయించకపోవడాన్ని ఏమనుకోవాలని దరాఖాస్తుదారులు ప్రశ్నిస్తున్నారు.

కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలి:

కూటమి ప్రభుత్వం మధ్యతరగతి వర్గాలకు న్యాయం చేయాలని ఎంఐజీ పథకంలో ప్లాటు కోసం దరఖాస్తు చేసుకున్న పెనుకొండకు చెందిన జనార్ధన్‌రెడ్డి కోరారు. ఎంతో ఆశతో సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు రెండో వాయిదా డబ్బు చెల్లించామని, లేఅవుట్‌లో కనీసం భూమి చదును కూడా చేయనేలేదని వాపోయారు. ప్రభుత్వం మారడంతో ఎంఐజీ లేఅవుట్లు అభివృద్ధికి నోచుకోవన్న అనుమానులున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం లేవుట్లను అభివృద్ధిచేసి రిజిస్ట్రేషన్లు చేయించాలని కోరారు.

మంత్రి స్పందించాలి

మధ్యతరగతి వర్గాల సొంతింటిక నెర వేర్చేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలి. గత ప్రభుత్వం చేపట్టిన ఎంఐజీ లేఅవుట్లను పూర్తిగా అభివృద్ధి చేసి దరఖాస్తు దారులకు అప్పగించాలి. పెను కొండలో ఇప్పటికీ భూమి చదును చేయనేలేదు. స్థానిక మంత్రి సవిత ఈ విషయంపై స్పందించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి.

హరి,
సిపిఎం నాయకులు

పెనుకొండలో స్మార్ట్ టౌన్‌షిప్‌కు కేటాయించిన స్థలం

'దులీప్‌ట్రోఫీ' భద్రతపై ఎస్పీ సమీక్ష

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

ఈనెల 5 నుండి 22 వ తేదీ వరకు అనంతపురం ఆర్డీటీ మైదానంలో జరిగే దులీప్ ట్రోఫీలో పాల్గొనేందుకు విచ్చేస్తున్న భారత క్రికెట్ ఆటగాళ్ల భద్రతపై జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదివారం సమీక్షించారు. క్రికెట్ ఆటగాళ్లు అనంతపురంలో బస చేస్తున్న మాసినేని, అలెగ్జాండర్ లాడ్జిల్లో కేటాయించిన గదులను పరిశీలించారు. భద్రతాపరంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో పోలీసు అధికారులకు దిశానిర్ధేశం చేశారు. అనంతరం భారత క్రికెట్ ఆటగాళ్లు స్థానిక ఆర్డీటీ మైదానానికి వెళ్లొచ్చే రూట్లలో ఎస్పీ పర్యటించి పలు సూచనలు చేశారు. ఆర్డీటీ మైదానంలో ఎలాంటి చర్యలు చేపట్టాలో పోలీసు అధికారులకు వివరించారు. డ్రెస్సింగ్ రూమ్ లు, పార్కింగ్ ప్రదేశాలు, ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లు, గ్యాలరీలు, పార్కింగ్ స్థలాలు తదితర ప్రదేశాలను నిశితంగా పరిశీలించారు. అదేవిధంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాల రాకపోకలు సాఫీగా జరిగేలా సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అనంతపురం రూరల్ డీఎస్పీ బి.శివారెడ్డి, ఎఆర్ డీఎస్పీ మునిరాజ, వన్‌టౌన్ సిఐ రాజేంద్రనాథ్ యాదవ్, టూటౌన్ సిఐ శ్రీకాంత్, రాప్తాడు సిఐ శ్రీహర్ష, ఆర్ఐ కె.రాముడు, వన్ టౌన్ ఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మైదానంలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

సైద్ధాంతిక ఆలోచనలతోనే జెవివి అభివృద్ధి

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

సైదాంతిక పరమైన ఆలోచన, శాస్త్రీయ విజ్ఞానంతోనే జనవిజ్ఞాన వేదిక అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా వార్షిక మహాసభ ఆదివారం నగరంలోని ఒకేషనల్ జూనియర్ కాలేజీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గేయానంద్ మాట్లాడుతూ ప్రచార సంబంధమైన కార్యక్రమాలు చేయడం ద్వారా జన విజ్ఞాన వేదిక అభివృద్ధి చెందినట్లు కాదని, ప్రజలను శాస్త్రీయ విజ్ఞానం వైపు మరల్చినప్పుడే నిజమైన అభివద్ధి అని అన్నారు. దేశంలో జరుగుతున్న అభివృద్ధి వెనక శాస్త్రీయ విజ్ఞానం, శాస్త్రీయ ఆలోచన దాగి ఉందని దీన్ని ప్రజల్లోకి తీసుకుపోయే విషయంలో మాత్రం ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని దీనివల్ల ప్రజల్లో అశాస్త్రీయ భావాలు ఇంకా నెలకొని ఉన్నాయని వ్యాఖ్యానించారు. దేశానికి స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్లు గడుస్తున్నా మూఢాచారాలకు అడ్డుకునే సరైన చట్టాలు లేకపోవడం వల్ల కొంతమంది తమకు తాము దైవాంశ సంభూతులుగా ప్రకటించుకొని అమాయకులైన ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. అందుకు మూఢచారాలకు వ్యతిరేకంగా చట్టాలు తీసుకురావాలని ఆయన ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జిల్లా ప్లీనం సందర్భంగా గతంలో చేసిన కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్ కర్తవ్యాలను నిర్ణయించుకోవడం జరిగిందని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకట్రామిరెడ్డి, లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర నాయకులు రంగన్న, సాకే భాస్కర్, జిల్లా నాయకులు డాక్టర్ పి.ప్రసూన, గాంగేనాయక్, వీరరాజు, రామిరెడ్డి, చిత్తప్ప, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో నిత్యావసరాలు ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రేషన్ దుకాణాల్లో బియ్యంతోపాటు చక్కెర కందిపప్పు, గోధుమపిండి అందజేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ దుకాణాల్లో సెప్టెంబర్ నెల కోటా కింద బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తున్నారన్నారు. ప్రస్తుతం ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రజలకు కనీస ఆహారాన్ని అందించేందుకు చౌకదుకాణాల వ్యవస్థను మెరుగు పరచాలని డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. అలాగే కొలతల్లో అక్రమాలను అరికట్టడంతో పాటు నాణ్యమైన సరుకులను ఇంటి వద్దకే అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈనెలలో వినాయక చవితి పండుగ ఉన్నందున బియ్యంతోపాటు కందిపప్పు, చక్కెర, గోధుమపిండి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో పట్టణ గ్రామీణ పేద దిగువ మధ్యతరగతి ప్రజలు కనీస సరుకులు కొనలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఇప్పటికైనా తెలుగుదేశం కూటమి ప్రజలకు ఇచ్చిన హామీలు అమలకు చిత్తశుద్ధితో కృషి చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాలకు ప్రజలు సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, ఓ.నల్లప్ప, వి.సావిత్రి, ఎస్.నాగేంద్ర, జిల్లా కమిటీ సభ్యులు రామిరెడ్డి, కృష్ణమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి, తరిమెల నాగరాజు, మన్నీల రామాంజనేయులు, వెంకటనారాయణ, నాగమణి, నిర్మల, రంగారెడ్డి, అచ్యుత్ పాల్గొన్నారు.

అనంతపురం జెఎన్‌టియు పరిధిలో పరీక్షలు వాయిదా

ప్రజాశక్తి -అనంతపురం

అధిక వర్షాలు పడుతున్న కారణంగా అనంతపురం విశ్వ విద్యాలయం పరిధిలో సెప్టెంబర్ 2వ తేదీ జరగాల్సిన అన్ని.పరీక్షలను అనంతపురం జెఎన్‌టియు పరీక్షల విభాగాధిపతి ఆచార్య నాగ ప్రసాద్ నాయుడు తెలిపారు. అధిక వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు పరీక్షలను వాయిదా వేసినట్లు ఆయన చెప్పారు. పరీక్షల తేదీలు త్వరలోనే ప్రకటిస్తామని ఆయన అన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్

ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

రైతులను పండ్ల తోటల పెంపకం వైపు మళ్లించేందుకు ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహాలు అందిస్తోందని ఇటీవల ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాల వల్ల విరివిగా పండ్ల తోటల పెంపకం సాగిస్తున్నారని శ్రీ సత్యసాయి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : పండ్ల తోటల సాగుతో రైతులకు ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయి.?

జ : అతివృష్టి అనావృష్టి చేత ఇటీవల చాలామంది రైతులు పంటలు సాగు చేయలేక పండ్లతోటల పెంపకంపై మక్కువ చూపుతున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మెట్ట భూముల్లో ఉద్యాన పంటలు సాగుకు ఆసక్తి చూపే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తోంది. పంట రకాన్ని బట్టి మొక్కల కొనుగోలు, గుంతలు తీసింది మొదలు పంట దిగుబడి వరకు వివిధ దశల్లో అయ్యే ఖర్చులను మూడు నుంచి రెండేళ్లపాటు భరించనుంది. ఐదు ఎకరాల లోపు నీటి వసతి ఉన్న రైతులకు గతంలో లబ్ధి పొందని వారందరూ ఈ పథకానికి అర్హులు. సాధారణ పంట తోటలతో పాటు గులాబీ, మల్లె, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్స్ వంటి 18 రకాల పండ్ల మొక్కలు పెంచేలా కార్యాచరణ రూపొందించింది.

ప్రశ్న : పండ్ల తోటలో పెంపకానికి ప్రభుత్వం నిర్వహణకు ఏయే ఖర్చులు ఇస్తోంది.?

జ : ఎకరా విస్తీర్ణంలో పంట సాగుకు మొక్కల కొనుగోలు, రవాణా, గుంతలు తీయడం మొక్కలు నాటేందుకు అయ్యే కూలీల ఖర్చులు ప్రభుత్వం ఇస్తుంది. ఒక్క మొక్క సంరక్షణకు రూ.4.25ల చొప్పున వంద మొక్కలకు రూ.425 ఇలా నెలకు నాలుగు విడతలుగా కలిసి మాస్టర్ల రూపంలో రూ.1700లు రైతులకు అందిస్తుంది. పాదులు తీసి నీరు పెట్టేందుకు మరో రూ.3500 ఇవ్వనుంది. ఇలా మొత్తం రూ. 5, 200 వరకు రైతు పొందవచ్చు. ఎరువులకు ఆరు నెలలకు ఒకసారి 3వేల రూపాయలు ఇస్తుంది. నిర్వహణ ఖర్చుల కింద ఉపాధి పని దినాలను బట్టి మూడేళ్లపాటు చెల్లిస్తుంది. మామిడికి మొదటి ఏడాది రూ.4,521, రెండవ ఏడాది రూ.29,926 మూడో ఏడాది రూ. 27,986 మూడేళ్లకు మొత్తం రూ.1,03,193లు ప్రభుత్వం చెల్లిస్తుంది. మునగ, పూల తోటలకు రెండు సంవత్సరాలు, మిగిలిన పండ్ల మొక్కలకు మూడు సంవత్సరాలు నిర్వహణ ఖర్చులు చెల్లిస్తుంది. వీటికి తోడు సబ్సిడీ ధరలకు స్ప్రింకర్లు, స్ప్రేయర్లు, పైపులు ,డ్రమ్ములు, పాథలిన్ పట్టలు, రైతులకు అందిస్తున్నాం.

3) పండ్ల తోటల పెంపకానికి వర్షాకాలం అనుకూలమా.?

జ: వర్షాకాలం పండ్ల మొక్కల పెంపకానికి ఎంతో అనుకూలం. ఇప్పుడు నాటితే వందశాతం మొక్కలు బతుకుతాయి. రైతులకు దాదాపు ఆరు నెలలు నీటిని అందించే శ్రమ ఉండదు. నాటిన ప్రతి మొక్క బతుకుతుంది. మెట్ట భూముల్లో పండ్ల మొక్కల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. మల్లె, గులాబీ, డ్రాగన్ ఫ్రూట్స్, మునగ మొక్కలు నాటేందుకు అవకాశం ఉంది. ఆసక్తి ఉన్న రైతులు ఆయా మండలాల్లోని ఉపాధి పథకం ఏపీవోలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు.

4) పండ్ల తోటలు నష్టపోతే ఎంత నష్టపరిహారం అందిస్తారు.?

జ : సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 2022 -23 సంవత్సరంలో కురిసిన వర్షాలకు 25 ఎకరాలలో పండ్ల తోటలకు నష్టం వాటిల్లింది. 316 మంది రైతులకు పంటనష్టం జరిగింది. అత్యధికంగా కాయగూరల పంటలైన టమోటాకు భారీ నష్టం వాటిల్లింది. జిల్లావ్యాప్తంగా 110 ఎకరాల్లో టమోటా పంట నాశనమైంది. నష్టపరిహారం బొప్పాయికి ఎకరాకు రూ.15వేలు అరటికి రూ.25 వేలు. మామిడికి ఎకరాకు నూ. 20 వేలు, కొత్తిమీర పంటకు రూ. 7,200లు నష్టపరిహారం రైతులకు అందిస్తాం.**ప్ర : గత నాలుగు సంవత్సరాల నుండి నష్టపోయిన రైతులను ఏ విధంగా ఆదుకుంటున్నారు.?**

జ : పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు ప్రతి సంవత్సరం ప్రభుత్వానికి అందిస్తున్నాం. గత ఐదు సంవత్సరాల నుండి ఉద్యాన పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తున్నాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలను ప్రతి సంవత్సరం అందజేస్తున్నాం.

పండ్ల తోటల రైతులు అప్రమత్తంగా ఉండాలి

వర్షాల నేపథ్యంలో పంటలను పరిశీలించిన అధికారులు

బెలుగుప్పలో అరటి పంటను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-బెలుగుప్ప

వర్షాకాలంలో పండ్ల తోటల రైతులు అప్రమత్తంగా ఉండాలని కళ్యాణదుర్గం డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి ఎం.కృష్ణతేజ సూచించారు. శనివారం కళ్యాణదుర్గం, బెలుగుప్ప బ్రహ్మసముద్రం మండలాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పండ్ల తోటల రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులందరూ అప్రమత్తంగా ఉండి పండ్ల తోటలను రక్షించుకోవాలని సూచించారు. అధిక వర్షాలు వచ్చినప్పుడు అవసరమైతే పంటపొలాల చుట్టూ తాత్కాలిక డ్రెయినేజీలను నిర్మించి అదనపు నీటిని బయటకు తరలించాలన్నారు. కూరగాయలు, పువ్వులు, పండ్లు వంటి సున్నితమైన పంటలను ప్లాస్టిక్ షీట్స్, ఇతర వస్తువులతో కప్పుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండలంలోని అరటి, పూలతోటలను ఉద్యానవన అధికారిణి ఉమాదేవి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోవు రెండు, మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఉద్యాన రైతులు జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. ముఖ్యంగా అరటి రైతులు పొలంలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈదురుగాలులకు విరిగిపోయిన అరటి తోటల్లో గెలలు ఉన్నట్లయితే వాటిని కోసి మార్కెట్ చేసుకోవాలన్నారు. అరటి తోటలు విరిగిపోయినట్లయితే శుభ్రం చేసి కొత్త పిలకలను వదులుకోవాలన్నారు. ఆకులు చాలా బాగా తడిసే విధంగా లీటర్ నీటికి 5 గ్రాములు సల్ఫేట్ ఆఫ్ పొటాష్, 5 గ్రాములు పొటాషియం నైట్రేట్ ఎరువులు మూడు రోజుల వ్యవధిలో మూడుసార్లు ఒకదాని తర్వాత ఒకటి పిచికారి చేసుకోవాలన్నారు. అరటి దుంపలు కుళ్లిపోకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటి కలిపి లేదా బోర్డో మిశ్రమం 1శాతం దుంప చుట్టూ తడిచేటట్లుగా నెలలో పోయాలన్నారు. అలాగే వర్షాలు పడుతున్నందున శిగటోక ఆకుమచ్చ తెగులు వచ్చే అవకాశం ఉండటంతో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రాయదుర్గం రూరల్ : అధిక వర్షాల వల్ల ఉద్యాన పంటలు దెబ్బతినకుండా పంట రక్షణపై రైతులు దృష్టి సారించాలని ఉద్యానవన శాఖ అధికారిణి మౌనిక సూచించారు. ఆదివారం క్షేత్రస్థాయిలో మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన ఉద్యాన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులందరూ అప్రమంతంగా ఉండాలన్నారు. అధిక వర్షాలు వచ్చినప్పుడు పంట పొలాల చుట్టూ తాత్కాలిక డ్రెయినేజీలను నిర్మించి అదనపు నీరు బయటికి వెళ్లేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కూరగాయలు, పువ్వులు, పండ్లు వంటి సున్నితమైన పంటలను ప్లాస్టిక్ షీట్స్, ఇతర వస్తువులతో కప్పి ఉంచాలన్నారు. పొడవైన మొక్కలు, బరువైన పండ్లు కలిగిన మొక్కలకు మద్దతు కోసం స్టేకింగ్, ట్రలీస్ పద్ధతిని అనుసరించాలన్నారు.

గుత్తి : ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు జాగ్రత్తలు తీసుకుని పంటలను కాపాడుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి నరసింహారావు, గుత్తి ఉద్యానవన అధికారిణి మిత్రవింద మాధవి సూచించారు. ఆదివారం మండలంలోని కొత్తపేట, తొండపాడు గ్రామాల్లో సాగు చేసిన కూరగాయలు, మిరప పంటలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూరగాయల పంటలలో వర్షం నీరు నిల్వ ఉండకుండా తాత్కాలిక కాలువలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పడి పోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదళ్ల దగ్గర మట్టిని ఎగదోయాలన్నారు. వేరుకుళ్లు ఆశించిన పంటలకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, 10 లీటర్ల నీటిలో కలిపి ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో పోయాలన్నారు. మిరప పంటలో నీరు అధికంగా ఉన్న పొలాల్లో 3 గ్రాములు 19:19:19 పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. టమాటా పంటకు అధిక వర్షాల వలన వేరుకుళ్లు,బాక్టీరియా తెగుళ్లు, ఫంగల్ తెగుళ్లు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. వాటి నివారణకు ట్రైకో డెర్మావిరిడి 5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి వేర్లు బాగా తడిచేలా పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ఎ అరుణ, రైతులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : ప్రస్తుతం వర్షాల కారణంగా ఉద్యానపంటలను కాపాడుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి నరసింహారావు సూచించారు. ఆదివారం మండలంలో సాగు చేసిన మిరప పంటను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలను అందజేశారు. వేరుకుళ్లుతోపాటు బ్యాక్టీరియా సోకి పంటలను రైతులు నష్టపోతారన్నారు. ఇందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యాప్తంగా ఉద్యానపంటల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారిణి మిత్రవిందమాదవి, వ్యవసాయ సహాకురాలు జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు

11వ రోజుకు కార్మికుల సమ్మె

గుత్తి : సమస్యల పరిష్కారం కోసం శ్రీసత్యసాయి తాగునీటి ప్రాజెక్టు కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం 11వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా పట్టణ శివారులో ఉన్న పంప్‌హౌస్ వద్ద కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికుడు ఎం.రామాంజనేయులు మాట్లాడుతూ శ్రీ సత్యసాయి తాగునీటి పథకానికి ప్రభుత్వం బడ్జెట్ కేటాయించాలన్నారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు : డిఎంహెచ్ఒ

అనంతపురం : జిల్లావ్యాప్తంగా వర్షాలు, వరదల నేపథ్యంలో ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఇబి.దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా పాముకాట్లుకు గురైనా, గర్భిణులకు వైద్యసేవలు అవసరమైనా, విద్యుత్ షాక్ గురైనా, ఏ ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే ఫోన్ నెంబర్ 08554-277434ను సంప్రదించాలని కోరారు.

హెల్ప్‌లైన్‌ను సద్వినియోగం చేసుకోండి

పుట్లూరు : భారీ వర్షాల నేపథ్యంలో మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేరసిన కంట్రోల్ రూమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ శేషారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల తీవ్రత, ఏదైనా సహాయం అవసరమైనా సంబంధిత అధికారులకు ఫోన్ చేయవచ్చన్నారు. విఆర్ఒలు అంకన్న సెల్.. 63018 73839, కె.వెంకటనారాయణ సెల్..98495 18659, శ్రీనివాసులు సెల్.. 99639 88310కు ఫోన్ చేసి సాయం పొందాలని కోరారు.

నేడు వైఎస్ఆర్ వర్ధంతి

శింగనమల : వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా సోమవారం మండలం కేంద్రంలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించడంతోపాటు అన్నదానం చేయనున్నట్లు వైసిపి నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే శింగనమల ప్రభుత్వ ఆసుత్రిలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కావున మండల వ్యాప్తంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నేడు పాఠశాలలకు సెలవు

యల్లనూరు : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం పాఠశాలలకు సెలవులు ప్రకటించినట్లు మండల విద్యాశాఖ అధికారి ఎల్‌పి.చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని తక్షణమే అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు గమనించాలని కోరారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

శింగనమల : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులతోపాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురువనున్నట్లు వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు ఎలాంటి సహాయ, సహకారాలు అవసరమైనా ఏర్పాట్లు చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ముఖ్యంగా రైతులు పొలాల్లో మోటార్లు, విద్యుత్ సామగ్రి వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు వస్తే వెంటనే ఎమ్మెల్యే కార్యాలయానికి తెలియజేయాలన్నారు. అలాగే కలెక్టర్ కార్యాలయం కంట్రోల్ రూంలో ఉన్న ఫోన్ నెంబర్లు 85002 92992, 08554-220009కు ప్రజలు ఫోన్ చేయాలని కోరారు.

రైతులు అధికారుల సలహాలు పాటించాలి

బ్రహ్మసముద్రం : మండలంలో పంటలు సాగు రైతులు అప్రమత్తంగా ఉంటూ పలు జాగ్రత్తలను తీసుకుని పంటలను కాపాడుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి సరిత ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ముఖ్యంగా పత్తి పంట నీటిముంపునకు గురైనప్పుడు పిందెలు, కాయలు రాలిపోవడం, ఆకులు ఎర్రబారడం, వడిపోవడం వంటివి జరుగుతాయన్నారు. నీటిముంపుకు గురైనప్పుడు మురుగు నీటిని తీసివేయడంతోపాటుగా, ఎండగా ఉన్న సమయంలో పోటాషియం నైట్రేట్ 5 గ్రాములు ఒక లీటర్ నీటికి లేదా 10 గ్రా యూరియాని లీటర్ నీటిలో కలుపుకుని వారంరోజుల వ్యవధిలో మార్చి మార్చి పిచికారి చేసుకోవాలన్నారు. వీటితోపాటు అధికారుల సలహాలు, సూచనలు తీసుకుని అన్ని రకాల పంటను కాపాడుకోవాలని కోరారు.

బురదమయమైన రోడ్డు

అనంతపురం రూరల్ : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కక్కలపల్లి గ్రామ ప్రధాన రహదారి బురదమయంగా మారింది. దీంతో ద్విచక్ర వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. నూతన రహదారి నిర్మించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

'దుర్గం'లో అక్రమ కట్టడాలు కూల్చివేత

కళ్యాణదుర్గం : పట్టణంలోని శిరిడీసాయి ఆలయ సమీపంలో డ్రెయినేజీలకు అడ్డంగా నిర్మించిన అక్రమ కట్టడాలను మున్సిపల్ అధికారులు ఆదివారం కూల్చివేశారు. ఇటీవల మురికి కాలువలు, డ్రెయినేజీల్లో నీరు వెళ్లేందుకు అడ్డంగా నిర్మించిన కట్టడాలను తొలగించాలని ఆక్రమణదారులకు హెచ్చరికల నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ వారిలో స్పందన లేకపోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా అక్రమ కట్టడాలను కూల్చివేసినట్లు కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ తెలిపారు.

కరువు రైతు జీవితంపై లఘుచిత్రం

అనంతపురం : రాయలసీమ కరువు రైతు జీవితాన్ని ప్రపంచానికి చాటి చెప్పే విధంగా సేద్యం సినిమాను తీర్చిదిద్దినట్లు 'సేద్యం' లఘు సినిమా డైరెక్టర్ పసుపులేటి చంద్రకాంత్ తెలిపారు. ఈ సినిమా సెప్టెంబర్ 6న యూట్యూబ్ వేదికగా ప్రజల ముందుకు రానున్నట్లు తెలిపారు. ప్రీ రిలీజ్‌లో భాగంగా అనంతపురంలోని రుద్రంపేట ప్రాంతంలో ఉన్న చోటా థియేటర్‌లో సేద్యం ప్రీ రిలీజ్ షోను ఆడించినట్లు తెలిపారు. రైతు బతుకులు తెలిపే చిత్రంగా సేద్యం అత్యంత జనాదరణ పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కరువు జిల్లాలో రైతు జీవితాలు కళ్ళకు కట్టినట్లుగా సేద్యం మూవీలో చూపించినట్లు చెప్పారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా యువ కళాకారులను పరిచయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేద్యం మూవీ నటీనటులు యాంకర్ రమేష్, డాన్స్ మాస్టర్ విజయ్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

బహుభాషా కోవిదుడు పుట్టపర్తి నారాయణాచార్యులు

వర్ధంతి సభలో సాహితీమిత్రులు

నారాయణాచార్యులకు నివాళులర్పిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

తెలుగు సాహితీకారులలో అగ్రగన్యుడు, బహుభాషా కోవిదుడు పద్మశ్రీ డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యులు అని పలువురు వక్తలు కొనియాడారు. పుట్టపర్తి నారాయణచార్యుల వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని లలిత కళా పరిషత్ సమావేశ మందిరంలో పరిషత్ అధ్యక్ష, కార్యదర్శి, కార్యవర్గ సహకారంతో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లలిత కళా పరిషత్ అధ్యక్షులు డాక్టర్ గాజుల వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పుట్టపర్తి నారాయణాచార్యులు చిన్న వయసులోనే భారతం, భాగవతం పురాణాలతోపాటు సంగీతం నేర్చుకున్న గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెయు తెలుగు శాఖ అకడమిక్ కన్సల్టెంట్ నానీల నాగేంద్ర, తెలుగు వెలుగు సాహిత్య, సామాజిక సేవా సంస్థ అధ్యక్షులు టివి.రెడ్డి, అనంత సాహితీ ట్రస్టు వ్యవస్థాపకులు గంగిరెడ్డి అశ్వర్థరెడ్డి, ఉమర్ అలీషా సాహిత్య పీఠం కార్యదర్శి షేక్ రియాజుద్దీన్, ద్విభాషకవి డాక్టర్ జూటూరు షరీఫ్, ఉమర్ , ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు ఎం.సాంబశివుడు, కె.సుబ్బరాయుడు, కెఎల్‌ఎం.ప్రసాద్, నాగభూషణం, శ్రీనివాసులు, విజయ భాస్కర్‌రెడ్డి, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత

ప్రజాశక్తి-రాయదుర్గం

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పట్టణంలోని మురికి కాలువల్లో అధికారులను యుద్ధప్రాతిపదికన పూడికతీత పనులు చేపట్టారు. ఇందులో భాగంగా ఆదివారం పట్టణంలోని తన ఛాంబర్‌లో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి పట్టణంలో పారిశుధ్య ప్రణాళిక మౌలిక సౌకర్యాల కార్యదర్శులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలో ఏర్పాటు చేసిన భారీ హోర్డింగుల స్థితిగతులను పరిశీలించారు. అనంతరం శనివారం రాత్రి సత్యనారాయణ స్వామి గుడి వద్ద ప్రధాన మురికి కాలువలో పూడికను జెసిబి సాయంతో తొలగించారు. పుట్టప్ప తోట వద్ద ప్రధాన మురికి కాలువలో ప్రవాహానికి అడ్డుగా ఉన్న వాటర్ బాటిళ చెత్తాచెదారాన్ని పారిశుధ్య సిబ్బంది సాయంతో తొలగించారు. ముంపు ప్రాంతాలైన మధు టాకీస్, పుట్టప్పతోట, కొలిమి బజార్, రామస్వామి వీధి, సీతమ్మ కుంట, సత్యనారాయణ స్వామి గుడి వీధి, కృష్ణాశ్రమం, మటన్ మార్కెట్, తదితర ప్రాంతాల్లో కమిషనర్ దివాకర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎప్పటికప్పుడు మురికి కాలువలో చెత్తాచెదారం పూడికను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. వర్షం వల్ల ఎవరైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే మొబైల్ నెంబర్ 91545 66253కు ఫోన్ చేయాలన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకి రాకూడదన్నారు.

మురికి కాలువలో పూడిక తీస్తున్న కార్మికులు

తడిసిన విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దు

ప్రజాశక్తి-పుట్లూరు

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు ఎవరూ తడిసిన కరెంట్ స్తంభాలను ముట్టుకోరాదని ఎఇ విజయుడు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. చుట్టుపక్కల విద్యుత్ లైన్లకు చెట్లకొమ్మలు తాకుతున్నట్లు కనిపిస్తే విద్యుత్ అధికారులకు తెలియజేయాలన్నారు. అలాగే ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో పట్టుకోరాదన్నారు. బయట పెట్టిన లైట్లు నీటితో తడవకుండా చూసుకోవాలన్నారు. చిన్న పిల్లలను కరెంటు వస్తువుల వద్దకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలి. ఉతికిన దుస్తులను ఇనుప తీగలపై వేయకూడదన్నారు. ఇంట్లో ఉన్న వాటర్ హీటర్‌ను స్విచ్ ఆఫ్ చేసిన తర్వాతనే నీటిని తీసుకోవాలన్నారు. ఉరుములు, మెరుపులతో వర్షం పడేటప్పుడు డిష్ కనెక్షన్ తీసివేయాలన్నారు. కరెంటు లైన్ కింద సెల్‌ఫోన్‌లో మాట్లాడకూడదన్నారు. ప్రజలు ఆయా జాగ్రత్తలను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

బైరవానతిప్ప ప్రాజెక్టు పరిశీలన

బైరవానితిప్ప ప్రాజెక్టును పరిశీలిస్తున్న తహశీల్దార్ సుమతి, ఎంపిడిఒ దాసానాయక్

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల వ్యాప్తంగా కూలడానికి సిద్ధంగా ఉన్న పాతఇళ్లను అధికారులు పరిశీలించారు. ఇందులో భాగంగా ఆదివారం మండలంలోని బైరసముద్రం గ్రామానికి చెందిన పూజారి యశోదమ్మ ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ దాసానాయక్, హౌసింగ్ ఎఇ చైతన్యరాజ్ మాట్లాడుతూ భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇందులో భాగంగానే కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో కూలడానికి సిద్ధంగా ఉన్న ఇళ్లను పరిశీలించి జాబితాను కలెక్టర్‌కు పంపుతున్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలో యశోదమ్మ ఇల్లు 90శాతం కూలడానికి సిద్ధంగా ఉందని ధ్రువీకరించారు. ఒక్కసారి వర్షం వచ్చినా ఇల్లు కూలిపోతుందన్నారు. ఆమెను తాత్కాలిక ఇంటిలోకి మార్చాలని స్థానిక అధికారులకు సూచించారు. అదేవిధంగా పాలవెంటాపురం గ్రామంలో 4ఇళ్లు కూలడానికి సిద్ధంగా ఉన్నట్లు అధికారులకు సమాచారం అందించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఈరక్క, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

భారీగా కురుస్తున్న వర్షాలు కారణంగా ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ సుమతి సూచించారు. ఆదివారం మండలంలోని ఎస్సీ బాలుర వసతిగృహంతోపాటు బైరవానితిప్ప ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రహ్మసముద్రం తహశీల్దార్ కార్యాలయంలో 24 గంటలు సిబ్బందిని అందుబాటులో ఉంచి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారన్నారు. వరదల వల్ల నష్టాలు ప్రమాదాలు సంభవిస్తే వెంటనే ఫోన్ నెంబర్ 88971 69433ను సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

సమాజానికి ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు మరువలేనివి అని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. రాయదుర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేష్ బాబు ఉద్యోగ విరమణ సందర్భంగా ఉపాధ్యాయులు సోమశేఖర్ అధ్యక్షతన ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెంకటేష్‌బాబు ఉపాధ్యాయులుగా, ప్రధానోపాధ్యాయులుగా, మండల విద్యాశాఖ అధికారిగా విద్యారంగానికి చేసిన సేవలు మరువరానివన్నారు. ఆయన ఉద్యోగ విరమణ చెందినప్పటికీ శేషజీవితంలో తన విశేష అనుభవాన్ని భావితరాలకు చెందిన విద్యార్థులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం మండల విద్యాశాఖ అధికారులు నాగమణి, వెంకటరమేష్, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'నాటో' దేశాల సామ్రాజ్యవాదం నశించాలి

సిఐటియు, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అమెరికా నాటో దేశాలు యుద్ధం పేరుతో చేస్తున్న మారణ కాండ తక్షణమే నిలిపివేయాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. పాలస్తీనా ఇజ్రాయిల్, ఉక్రెయిన్ నాటో దేశాలు చేస్తున్న యుద్ధాన్ని ఆపి శాంతి కొల్పాలని డిమాండ్ చేస్తూ సిఐటియు, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో కొవ్వొత్తులతో శాంతిర్యాలీ నిర్వహించారు. లలిత కళాపరిషత్ నుంచి టవర్‌క్లాక్ సర్కిల్ గాంధీ విగ్రహం వరకూ కొవ్వొత్తులతో ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలస్తీనా ప్రజలపై అమెరికా దేశం ప్రోత్సాహంతో ఇజ్రాయిల్ ఉక్రెయిన్ చేస్తున్న మారణకాండలో 40 వేల మంది మృతి చెందారని, లక్ష మందికి పైగా క్షతగాత్రులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. యూధులుగా వచ్చిన వారిని ఒక ప్రాంతంలో ఉండి జీవించాలని శరణుకోరి నివాసం కల్పించిన పాలస్తీనాపైనే నేడు ఇజ్రాయిల్ యుద్ధం చేయడం దారుణమన్నారు. పాలస్తీనాలో యుద్ధంలో క్షతగాత్రులైన వారికి వైద్యం అందిస్తున్న ఆసుపత్రులను టార్గెట్ చేస్తూ మారణకాండ సృష్టిస్తోందన్నారు. మందులు, తిండి అందకుండా అడ్డుకుని ప్రజల ప్రాణాలు తీస్తున్నారని, అభం శుభం తెలియని పసిపిల్లలు మృతి చెందారని తెలిపారు. యుద్ధంలో వేలాది మంది చనిపోతుంటే యుద్ధం ఆపాల్సిన ప్రపంచ దేశాలు ప్రేక్షకపాత్ర పోషించడం బాధాకరం అన్నారు. ఈ యుద్ధాలు చూస్తుంటే ఇప్పటికీ ఆగేలా లేవని, కొనసాగితే ప్రపంచ యుద్ధంగా మారే ప్రమాదం పొంచి ఉందన్నారు. అణుబాంబులు వేసుకుంటే మానవ వినాశనానికి దారీ తీస్తుందన్నారు. తక్షణమే యుద్ధాని ఆపేలా ప్రపంచ దేశాలు చొరవ చూపాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ ప్రపంచ శాంతికి అమెరికా, నాటో దేశాల సామ్రాజ్యవాదం విఘాతం కలిగిస్తోందన్నారు. యుద్ధాల కారణంగా ప్రపంచ దేశాల్లో నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయని, ముడి సరుకు రవాణాకు అంతరాయం కలగడంతో పరిశ్రమలు నడవక నిరుద్యోగం పెరుగుతోందన్నారు. మోడీ ప్రభుత్వం అమెరికాతో చేతులు కలిపి దేశానికి నష్టం చేస్తోంది. యుద్ధాలు వద్దు, శాంతి నెలకొల్పుదామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, జిల్లా కోశాధికారి గోపాల్, రాజమోహన్, జిలాన్, రామాంజనేయులు వెంకట్ నారాయణ, రామ్‌రెడ్డి, బాల రంగయ్య మెడికల్ రిప్స్ యూనియన్ సురేంద్ర, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, జిల్లా కార్యదర్శి మధు, ప్రజానాట్య మండలి నగర అధ్యక్ష, కార్యదర్శులు పుల్లన్న, లక్ష్మీనారాయణ, అంబులెన్స్ డ్రైవర్ యూనియన్ జిలాన్ ,రమేష్ ఐద్వా నగర కార్యదర్శి చంద్రిక, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ సిద్ధూ, భీమేష్, మున్సిపల్ యూనియన్ నాయకులు ఏటీఎం నాగరాజు ఆదినారాయణ,ఎరిస్వామి తిరుమలేష్, లక్ష్మీ నరసమ్మ ,డివైఎఫ్ఐ బాలకష్ణ, నూరుల్లా, కెవిపిఎస్ వెంకటేష్, అక్కులప్ప, తదితరులు పాల్గొన్నారు.

రేపు గౌరసంద్ర మారెమ్మ ఆలయ వార్షికోత్సవం

గౌరసంద్ర మారెమ్మ ఆలయం

ప్రజాశక్తి-బెలుగుప్ప

మండల కేంద్రంలో కొలువుదీరిన గౌరసంద్ర మారెమ్మ దేవత ఆలయంలో అమ్మవారి వార్షిక పూజోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలకు ధ్వజారోహణంతో పూజలు ప్రారంభమై అభిషేకం, అష్టోత్తర శతనామార్చన, కండోల స్వీకారం, పోతలింగేశ్వర స్వామి దేవస్థానం నుంచి అమ్మవారికి ఒడిబియ్యం తీసుకురావడం, ఒడిబియ్యం సమర్పణ, ప్రత్యేక అలంకారం, మహా మంగళహారతి వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తర్వాత పురవీధుల గుండా అమ్మవారి ప్రభ ఊరేగింపు, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, సాయంత్రం సామూహిక కుంకుమార్చన, మంగళహారతి, రాత్రి భజనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలి

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎపి మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ షేక్ రుకియాబేగం

గుత్తి : సీజనల్ వ్యాధులపై విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలని ఎపి మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ షేక్ రుకియాబేగం, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ సూచించారు. ఆదివారం పట్టణంలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థినులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా పాఠశాల పరిసర ప్రాంతాలు, వంట గదులను పరిశీలించారు. విద్యార్థుల నుంచి సమస్యలను అడిగారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణకుమారి, శ్రీదేవి, ఎస్ఎఫ్ఐ నాయకులు ధను, నవీన్ యాదవ్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

తోపుడుబండ్ల వ్యాపారులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ జయనాయక్

రాయదుర్గం : పట్టణంలోని రాణిసత్రం, వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డు, తదితర ప్రాంతాల్లో పోలీస్ ఇన్‌స్పెక్టర్ జయనాయక్ ఆదివారం ట్రాఫిక్ నిబంధలనపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా కూరగాయలు, తోపుడు బండ్లను రోడ్డుపై లేకుండా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులతోపాటు తోపుడు బండ్ల వ్యాపారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సహకరించాలని కోరారు.

కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం మాకొద్దు : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రాయల్, ఎస్.సిరాజుద్దీన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో అనంతపురం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శులు నరేష్, సతీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్ వలి, కోటిగారి వన్నప్ప, పట్నం శ్రీనివాసులు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులకు సంబంధించి కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని ఎపిటిఎఫ్ పూర్వపు రాష్ట్ర అధ్యక్షులు రఘురామిరెడ్డి డిమాండ్ చేశారు. పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం ఎపిటిఎఫ్ రాష్ట్రసంఘం పిలుపు మేరకు ఆదివారం తాడిపత్రి తహశీల్దార్ కార్యాలయం ముందు ఎపిటిఎఫ్ జిల్లా బాధ్యులు డేనియల్ అధ్యక్షతన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు సంబంధించి 2004లో ప్రారంభించిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం సరైంది కాదన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు జయచంద్ర, ఉపేంద్ర, రామాంజనేయులు, అంకాలుయాదవ్, శివుడు, కిషోర్, అంజన్‌కుమార్, రవిశంకర్, శ్రీవాస్తవరెడ్డి, జనార్ధన, సూర్యనారాయణరెడ్డి, నటరాజ, ఓబయ్య, నాగేంద్ర పాల్గొన్నారు.

రాయదుర్గం: సిపిఎస్‌కు వ్యతిరేకంగా రాయదుర్గంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు జి.మోహన్‌రెడ్డి, టి.రామాంజనేయులు, రామకృష్ణ, నాయకులు పాండు, కె,రామాంజినేయులు, మల్లికార్జున, సిద్ధేశ్వర, ప్రధాన కార్యదర్శి, అనిల్‌కుమార్, ఖాసీం, రంగప్ప, రజాక్, నిజాముద్దీన్, ఎం.తిప్పేస్వామి, సురేష్, సునీల్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మృతిచెందిన గుర్రప్ప

రాయదుర్గం : గతనెల 13వ తేదీన రాయదుర్గం పట్టణం పైతోట జాతీయ రహదారి గాలి మారెమ్మ దేవస్థానం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్రప్ప ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. వివరాల మేరకు.. గతనెల 13న గాలి మారెమ్మ గుడి సమీపంలో కర్నాటక రాష్ట్రంలోని మొలకల్మూరు వైపు నుంచి రాయదుర్గానికి వస్తున్న ద్విచక్ర వాహనంపై వస్తున్న పాలయ్య, రాయదుర్గానికి చెందిన గురప్పను ఢీకొట్టాడు. దీంతో గాయపడిన గుర్రప్ప కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఈ నేపథ్యంలో పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోవడంతో గురప్ప భార్య, పిల్లలు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.